# 7

## శృంగారలహరి...

సరిగ్గా ఐదున్నరకు ఆఫీసునుంచి అతడు ఇంటికొచ్చి, నడిమి హాల్లో ఆమె కనబడకపోయేసరికి మెల్లిగా, చప్పుడు చెయ్యకుండా పిల్లిలాగా అడుగులో అడుగువేసుకుంటూ వెళ్ళి వంటింట్లోంచి పెరట్లోకి ప్రవేశించే గుమ్మంవద్ద నిలుచున్నాడు.

పెరట్లో అవతల ఇంటివాళ్ళమ్మాయి దడిదగ్గర నిలబడి ఊర్మిళతో మాట్లాడుతోంది. ఊర్మిళ పకపకా నవ్వుతోంది. ఆ ముఖం ఇరవైవొక్క చంద్రబింబాల వెలుగులా ఉంది. ఊర్మిళను అంత మంచి మూడ్‌లో కృష్ణమూర్తి యెప్పుడూ చూడలేదు. ఒక్కసారి ఊర్మిళవద్దకు పరిగెత్తి గట్టిగా ముద్దెట్టుకుందామనుకున్నాడు. అవతల ఇంటివాళ్ళ దడి దగ్గర నిలుచున్న అమ్మాయిపైన చెప్పలేని యీర్ష్య కలిగింది కృష్ణమూర్తికి. అంత పకపకా తనతో ఎప్పుడూ నవ్వలేదు ఈ నిద్ర పెద్దమ్మ. అని లోపల్లోపలే కోప్పడ్డాడు కృష్ణమూర్తి. పోనీ ఇంకాసేపు ఆ వెలిగిపొయ్యే ముఖాన్ని అలానే చూస్తూ వుందామనుకున్నాడు. కాని అవతల ఇంటివాళ్ళ దడిదగ్గర నిలుచున్న అమ్మాయి కృష్ణమూర్తిని చూడనే చూసింది. బహు తమాషాగా సినిమాల్లో వాళ్ళలాగ రెప్ప లార్చి ఊర్మిళకు సంజ్ఞ చేసింది. ఊర్మిళ ముఖం మీద నవ్వు వెలుగుతుండగా ఇటు తిరిగి చూసింది. అంతే. అష్టావక్రుడి చెల్లెలైంది ఆమె ముఖం. సిగ్గు, కోపం, నల్లని తెరలు ముఖాన దించుకుంది. కృష్ణమూర్తికి చిన్నతనాన ఎలిమెంటరీస్కూల్లో మేష్టారు చింతబరికెతో కొట్టినపుడుకూడ అంత యేడుపు వచ్చి

ఉండదు. అప్పటికీ ఇప్పటికీ ఒకటే భేదం. అపుడు లబోదిబోమని యేడ్చిఉంటాడు. ఇప్పుడు యేడవలేదు పైకి. ఆ కోస్తున్న జాజి మొగ్గలను వెండి పళ్ళెంలో అలానే ఉంచుకుని తప్పు చేసినదానిలా, రాజహంసలా అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చింది ఊర్మిళ. కృష్ణమూర్తి తలుపుదగ్గర రెండు చేతులూ అడ్డంపెట్టి "ఉహూఁ!" అన్నాడు ఊర్మిళ నవ్వుతుందని. ఊర్మిళ 'ఛీ' అన్నట్లు చూసింది. దడిదగ్గర అవతల ఇంటివాళ్ళ అమ్మాయి వీళ్ళకు వినపడేలా నవ్వుతూ ఇంట్లోకి పారిపోయింది. కృష్ణమూర్తి వెనక్కు తప్పుకొని ఆమె వెనకాలే నడిచాడు. ఊర్మిళ ఒక్కమాట మాట్లాడలేదు. కృష్ణ మూర్తికి చెప్పలేని కసిగా ఉంది. ఏమిటో చెప్పా పెట్టకుండా ఇలా ముఖం మాడ్చుకుంటే యెవరుమాత్రం యేం చేస్తారు? వచ్చి వారం రోజులన్నా కాలేదు. నిజానికి తనదగ్గర ఆమెగారికి యేమైనా లోపాలు కన్పించాయే అనుకుందాము. ఇంత త్వరలో కనిపించడం అసంభవం. అయినా తనదగ్గర యేం లోపా లున్నాయి? నిన్నా, మొన్నా ఆలయపు గూటిలో పావురాయిలా తన యెదకు హత్తుకుని సిగ్గుతో ముకుళించుకుపోయిన యీ పిల్ల ఇవాళ ఇంత అభిమాన పడ టానికి కారణం యేమిటో? తనకు ఈ వాలకం చూస్తుంటే ఇంకా యేడిపిస్తామన్న కోర్కె కలుగుతున్నది. పోనీ, ఆమెగారు మాట్లాడక పోతే తనకు వేరే దిక్కులేదా? నాలుగు దిక్కులున్నాయి. ఆమె తూర్పు అయితే తాను పడమర. తానూ మాట్లాడటం మానేస్తాడు. ఆమెకు యే దిక్కూ తోచక తన దిక్కు రావాల్సిందే. కృష్ణమూర్తి కోపం తెచ్చుకుని కూర్చున్నాడు. ఊర్మిళ ఫ్లాస్కులో కాఫీ వంచుక, అతనివేపు చూడటం అసలు ఇష్టంలేని దానిలా వచ్చింది. దగ్గరగా వచ్చింది, కృష్ణమూర్తి కళ్ళు మూసుకున్నాడు చప్పున. ఊర్మిళకు అంత కోపంలోనూ నవ్వు వచ్చింది. మళ్ళీ దుఃఖమూ వచ్చింది.

"నిద్రపోతున్నారా?" అన్నది.

చప్పున కోపం వచ్చింది కృష్ణమూర్తికి.

కళ్ళు తెరవకుండానే "అలా అంటానికి సిగ్గయినా లేదు. నా

పేరే నిద్రకదూ. నే నొట్టి నిద్ర పెద్దమ్మను. నిద్ర మొహాన్ని. అను అను.''

ఇంకెప్పుడయినా అయితే చేతిలో కాఫీ వొలికిపోయ్యేలా కిలకిలా నవ్వి ఉండేది ఊర్మిళ. ఇప్పుడు పులకలేదు పలకలేదు.

"ఇంద, కాఫీ తెచ్చాను! చల్లారిపోవచ్చు."

"ఇలా తే'' కళ్ళు మూసుకునే.

కాఫీ మీద వొలికినై. అయినా ఊర్మిళకు నవ్వు రాలేదు.

కాఫీ తాగేసి "ఇలా రా!'' అన్నాడు.

ఆమె రాలేదు. తనే వెళ్ళి ఆమె నడుముచుట్టూ చేతులు వేసి,

"ఎందుకే కోపం?!''

''ఛీ! వదలండి.

కృష్ణమూర్తికి కోపమూ వచ్చింది. నవ్వూనూ.

గట్టిగా మంటపుట్టేలా ముక్కు పట్టుకుని చూపుతూ "నే నెవర్నే?'' అని అడిగాడు.

విడిపించుకుని కోపంగా "ఎవరా? గోపాలకృష్ణులని నాకేం తెలుసు!?'' అంది.

ఆ మానవుడికి అర్థం కాలేదు. పకపకా నవ్వాడు. ఊర్మిళ విస్తుపోయింది. "ఎందుకా నవ్వు! తెలివే!'' ఊర్మిళకు కోపం వస్తున్నది.

"నల్లనివాడు, పద్మనయనమ్ములవాణ్ణి అంటావు'' నవ్వు ఆపకుండా, తన తెలివికి తానే సంతోషిస్తూ.

"ఆ, అలానే అంటాను. నేను రాకముందు యీ ఇల్లు బృందావనమని నాకేం తెలుసు!'' బుడిబుడి దుఃఖం అప్పుడే వచ్చేస్తున్నది. కృష్ణమూర్తికి కార్తీకమాసంలో తెల్లవారుఝామున్నే లేపి, పెరట్లోకి తీసుకెళ్ళి కొత్తకుండలో నీళ్ళు చెంబెడు తలమీద దిమ్మరించినట్లయింది. 'హా' అనుకున్నాడు.

కాస్త కాస్త అర్థమవుతూ వచ్చింది? నిమిష నిమిషానికీ ఇలాంటి దురూహ ఊర్మిళకు ఎలా కలిగిందో అర్థంకాలేదు. ఇటు

వంటి దుర్ఘటన ఒకటి జరుగుతుందని, కళ్ళు మూసుకుని, తమాషా కైనా వూహించలేదు.

కాసే పలానే నిలుచుండిపోయాడు! ఊర్మిళ ఇంట్లోకి వెళ్ళి పోయింది. కృష్ణమూర్తికి మనస్సున కోపం పెరగటం చోటులేక ఆగిపోయింది. "అబ్బ! ఎంత ఈర్ష్య. అర్థంలేని యీర్ష్య! అసలు యేమైనా వుంటేకదా. నాకు తోడు రొమాన్సుకూడానా! ఆడపిల్లల వేపు చూడటానికే భయం నాకు. ఎవరేనా నవ్విపోతారు."

"చూడు, ఇలాంటివాళ్ళను ఇంకా ఏడిపించాల్సిందే. ఇవాళ్టి నుంచీ మాట్లాడతానేమో చూడు. మాట్లాడితేనే వొట్టు" ఇలా అను కొని వంటింటి గడపదాకా వెళ్ళి "ఇదిగో నేను సినిమాకు వెళ్తు న్నాను. నువ్వూ వస్తావా?" అన్నాడు.

"నేను రాను!"

వీరుడిలా వీధి వాకిలి దాటేశాడు కృష్ణమూర్తి. తరువాత సినిమాకు పోవా లనిపించలేదు. ముందుకు నడుస్తున్నాడు ఏమీ తోచక.

"చూశావా, చూశావా! నేను రానంటే మాత్రం ఆయన అలా వెళ్ళిపోవటమేనా! నిజంగా నేను రావాలని ఉంటే ఆయ నొక్కరూ అలా వెళ్ళిపోగలరా?" ఊర్మిళ కళ్ళు తుడుచుకుంది, పాపం, యేడుపు రాకపోయినా!

నిజానికి నిద్ర పోకుండా ఒక్కతీ బిక్కు బిక్కుమంటూ ఎనిమిదిన్నరదాకా ముఖాన కోప చిహ్నా లేవీ లేవు. కృష్ణమూర్తి సినిమాకు పోలేదని ఊర్మిళకు తెలిసిపోయింది. ఆమెకు సంతోషం లాంటిది కలిగింది. కాని ముఖాన గంటుపెట్టుకునేఉంది. దీన్నే ఆలం కారికులు బిబ్బోకం అంటారు. కృష్ణమూర్తి దగ్గరగా వచ్చి "అన్నం తిన్నావా" అని అడిగాడు. మూరపెట్టి కొలిస్తే ఆమెమూతి అంత!

కృష్ణమూర్తికేం నవ్వు రాలేదు.

"చండీ! నాకైనా భోజనప్రాప్తి ఉన్నదా?"

"అంత చండి నని తెలిస్తే న న్నెందుకు చేసుకున్నారు?"

"నా కేం తెలుసు నమ్మా! శూర్పణఖను ప్రేమించినా బావుండేది!"

"ఎవరు చూసొచ్చారు లెండి" ఇంకా యేదో అనబోయి వంటింట్లోకి నడిచింది పీటమీద పదిలంగా కూచుంటూ పళ్ళెం ముందుకు లాక్కుంటూ "నా కాకలిలేదు. వడ్డించకు" అన్నాడు. ఊర్మిళకు నవ్వు రాలేదు.

భోజనాలైన తరువాత చాప పరచి, దిండువేసి, దుప్పటి పరచుకుంటుంటే "నేనున్నూ ఇవాళ చాపమీదనే పడుకుంటాను. వొళ్లు నొప్పులుగా వున్నట్లున్నాయి." ఊర్మిళకేమీ నవ్వు రాలేదు. టేబిలుమీదఉన్న వెండి పళ్లెం తానే తెచ్చి వోపిగ్గా వొక్కొక్క పువ్వే గుచ్చాడు. తనకేం పట్టనట్లు, యేదో వారపత్రికలో చచ్చుకథ వొకటి చదువుతూ కూర్చుంది. ఆ జాజి పూల మాల తానై తెచ్చి తలలో తురుముతుంటే, విసుగ్గా పెడసరంగా లాక్కుని తానే అలంకరించుకుంది.

కృష్ణమూర్తికి కోపం వచ్చి వెళ్ళి దుప్పటి కప్పుకుని నిద్ర పోయినాడుట! ఊర్మిళకున్నూ చదువుతున్న చచ్చుకథ అర్థం కాక, పోయి చాపమీద పడుకుని హాయిగా నిద్రించెనట.

తెల్లవారెనట.

ఈ ఉదయం కృష్ణమూర్తికి యేమీ సంతోషంగా లేదు.

"రమణి యొకింత కోపన, పరాఙ్ముఖియైనది...." కారణం తెలీటంలేదుట. ఈ దురదృష్టం యెలా సంభవించిందో తెలియటం లేదు. శిల్పానికి చక్కిలిగింతలులాగున అప్పుడప్పుడు ప్రణయ కోపాలు రావటం మిక్కిలి ఆరోగ్యకరమే కాక, ఉద్దీపన విభావాలున్నూ అవునని శాస్త్రకారుడు చెపుతూ ఉన్నప్పటికీ కృష్ణమూర్తికి దిగులైంది. "ఈ పెంకితనాన్ని నేను భరించలేను. ఇక క్షణంకూడ భరించలేను." అనుకున్నాడు. అయినా తనను చూస్తేనే ఆ మొముఖం అలాకావడం! నిన్నను చూడలేదూ,అవతల ఇంటివాళ్ల అమ్మాయితో యెంతో కులాసాగా నవ్వటం. తాను ఏం చేశాడు? పోనీ ఇలా అని

చెప్పకూడదూ! ఈ వ్యంగ్యబాణాలు విసరటం దేనికో? ఇట్లా అని పించడంతో నేరుగా వెళ్ళాడు వంటింట్లోకి. ఆమె యేదో తెగని జీవ న్మరణ సమస్యనుగురించి ఆలోచిస్తున్నట్లుగా ముఖంపెట్టి కాఫీ ప్రయత్నంలో పాలు కాగుతుంటే చూస్తూ కూచున్నది. "ఇదిగో ఊర్మిళా" అని ఎంతో సీరియస్‌గా పిలిచాడు కృష్ణమూర్తి. ఊర్మిళ వులిక్కిపడ్డది. ఆ పిలుపు ఎంతో కొత్తగాఉంది. ఒక్కసారి తమ ఇద్దరి మధ్యా దూరం ఎంతో యెక్కువైనట్లు అనిపించిందామెకు. చాలా దుఃఖం వచ్చింది. కాని నిమిషంలోనే దుఃఖస్థానాన్ని అభిమానం ఆక్రమించుకున్నది. దాంతో అతడి పైన యెంతో అసహ్యపు భావం లాంటిది కలిగింది.

కృష్ణమూర్తి దగ్గరగా వచ్చాడు. "నీ ప్రవర్తన నాకు బొత్తిగా అర్థంకావటంలేదు. నవ్వులుకాదు. నిజంగా, సీరియస్‌గా అడుగుతున్నాను. ఏమిటో నీ బాధ చెప్పు. నా కిలా యేమీ బాగులేదు. కోపంకొద్దీ యేదైనా అనేముందు ఆలోచించుకోవాల. నేను యేదైనా అంటే నువ్వూ బాధపడతావు. ఏమిటో అసలు విషయం చెప్పు."

ఊర్మిళకు యెక్కడలేని ధైర్యం వచ్చింది. ఆ అభిమానంతో "నేనే అసలు అడుగుదామనుకున్నాను. కాని మళ్ళీ వూరుకున్నాను. ఇవాళ మీరు నన్ను తప్పు పట్టుతున్నారు. నిన్న మీరు బట్టలు సర్దు తుంటే మీ సూట్ కేస్ తెరిచాను. అంత రహస్యంగా దాచారే ఆ ఫొటో-మీ రన్నారుగా, ఆ శూర్పణఖ....అంత రహస్యంగా దాచ వలసిన అవసరం యేమిటీ? ఆ ఫొటో యెవరిదీ అని అడుగు తున్నాను." ఒక్క నిముషంసేపు కృష్ణమూర్తి ప్రాన్పడిపోయినాడు. కృష్ణమూర్తికి కోపమూ, నవ్వూ సముద్రపుటలలులా పొంగు తున్నాయి.

కాసేపు మవునంగా వూర్కొని "అవును. నేను చదువుకునే రోజుల్లో ఆ అమ్మాయిని ప్రేమించాను. ఇంతా అంతా ప్రేమించానా! నా ప్రాణంకంటే యెక్కువ ప్రేమించాను. ఏం చెప్పను, సిగ్గులేని వాణ్ణి కాబట్టి ఇంకా నా ప్రాణాలు నిలిచివున్నాయి." అన్నాడు.

ఊర్మిళ ముఖం నల్లగా మాడిపోయింది. దుఃఖంతోనూ, అసహ్యంతోనూ, కోపంతోనూ ఏడుపు వచ్చేట్లు వుంది.

"అలా అయితే పెండ్లెందుకు చేసుకోలేకపోయినారు?"

"ఏం చెప్పమంటావు. ప్రేమించిన వాళ్ళంతా పెండ్లిండ్లు చేసుకుంటున్నారా? అసలు పెండ్లిండ్లు చేసుకోవాలంటే యెందుకు ప్రేమించుకుంటారు? ఆయ నెవరో చెప్పినట్లు గుర్తు. ఈ దేశంలో ప్రేమించుకున్న వాళ్లు పెండ్లిచేసుకోరట. పెళ్లి చేసుకొన్నవాళ్లు ప్రేమించుకోరట."

"మీకు నమస్కారం చేస్తాను. నా ముందునుంచి లేచి వెళ్లిపొండి."

"నువ్వడిగితే చెప్పానుకాని ఇన్నాళ్ళనుంచీ చెప్పానా నా యీ విషాద ప్రేమగాథ!"

"ఏం మనుషులు బాబూ, నన్ను విసిగించవద్దని."

"ఊర్మిళా, నువు మంచిదానవే...."

"నన్నింక పిలవకండి నాతో మాట్లాడకండి."

"మరి మనం రోజూ పొద్దున లేచినప్పటినుంచీ సాయంకాలం దాకా చూసుకుంటూ ఉండాలి కదా. ఊర్మిళా, అట్లా మాట్లాడకుండా యెలా?"

"నేను బ్రతకడం మీకు ఇష్టంలేదులా వుంది."

"ఉర్మిళా...." అన్నాడు యెంతో ప్రేమగా, అభిమాన మంతా కూడ గట్టి గౌరవిస్తున్నట్లు. ఊర్మిళ బలహీనమైన మనస్సుతో చూసింది అతడివైపు. "ఛీ, పిచ్చిదానా...." కృష్ణమూర్తి లేచి ఇంట్లోకి వెళ్లాడు. మరునిమిషంలో ఆ ఫొటో పట్టుకొచ్చాడు. ఊర్మిళకు ముళ్ళమీద కూర్చున్నట్లనిపించింది. కృష్ణమూర్తి ఆ ఫొటోకున్న ఫ్రేమును విప్పుతున్నాడు. ఊర్మిళకు మనస్సులో యెంతో కసిగా ఉంది. కృష్ణమూర్తి ఫ్రేము విప్పతీశాడు. ఒట్టి ఫొటోను తీసుకుని ఊర్మిళ ప్రక్కనే కూర్చున్నాడు. "చదువు"—అన్నాడు. ఫొటో వెనుక ఏదో వ్రాసివుంటే ఊర్మిళ చూసింది. చూడవద్దు అనుకుంది. చదివింది. చదవవద్దనుకుని. 'కె. కృష్ణమూర్తి, బి.యస్.సి., ఫోర్త్

ఇయర్-ఫస్ట్ ప్రయిజ్, 'కలలాటి కాపురం' అనే నాటిక'' అని వ్రాసి ఉంది.

కృష్ణమూర్తి పకపకా నవ్వుతున్నాడు.

"ఆ శూర్పణఖ ఎవరో తెలిసిందా?" ఊర్మిళ తెల్లబోయింది.

"నేనేనే చిన్నారీ—నువు కసికొద్దీ శూర్పణఖ అన్నావు కాని,చూడు యెంత అందంగా వున్నానో, ఆడవేషం వేస్తే నీకన్నా అందంగా ఉన్నాను" కృష్ణమూర్తి ఆ ఫొటోను గుండెల కద్దుకుంటున్నాడు.

ఊర్మిళకు చెప్పలేని సిగ్గయింది.

చప్పునలేచి అవతల నిలబడి "ఇక నన్ను అంటుకోకు. నా ప్రేమను నేను మలినపరచుకోదలచలేదు."

"ఛీ! వదలండి" కృష్ణమూర్తి నవ్వుతూ.

వదల్లేదు. ఊర్మిళ మాట్లాడలేకపోతున్నది.

రెండు బుజాలు పట్టుకుని ముందుకుతీసి కాస్త దూరంలో వుంచి ముఖంలోకి చూశాడు. ఆమె చూడలేకపోతున్నది. వెక్కిరించాడు. తనవైపు చూసేట్లు చేసుకుని, ముఖం పక్కకు తిప్పేసుకుంది. కళ్లలో నీళ్లు తిరిగినయ్. తన ముఖాన్ని అతడి గుండెల్లో దాచుకోవాలని ఆమె ప్రయత్నం. అతడు గట్టిగా రెండుబుజాలు పట్టుకొని కాస్తదూరంలోనే వుంచాడు. దగ్గరకు రానివ్వటం లేదు.

ఒక చేత్తో ముఖం పైకి యెత్తాడు. కళ్లు తుడుచుకోబోయింది. కృష్ణమూర్తి తుడుచుకోనివ్వలేదు.

ఆమె ముఖంలోకి చూస్తూ "ఛీ, పో" అన్నాడు. చిన్నపిల్లలతో దోబూచి ఆడుతున్నట్లు.

ఆ యేడుపు కళ్లలోంచి అతడు ఈ జన్మకు మరిచిపోలేనంత అందంగా నవ్వింది ఊర్మిళ.

ఆమె అతగాడి ఆరవ ప్రాణం.

---